epaper.manachourasta.com

# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 27 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం, 24 డిసెంబర్ 2025 | పేజీలు : 04



## గడువులోపు పనులు పూర్తి

- మేడారంలో అభివృద్ధి పనులు పరిశీలించిన రాష్ట్ర మంత్రులు పొంగులేటి, సీతక్క

4



## హుస్నాబాద్ అభివృద్ధి దేశానికి దిక్సూచి కావాలి

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్, మన చౌరాస్తా:** హుస్నాబాద్ అభివృద్ధి మాటల్లో కాదు.. పనుల్లో కనిపించాలని, ప్రతి గ్రామం పురోగతిలో ముందుండాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఏ శాఖ ఒంటరిగా కాకుండా, అన్ని శాఖలు కలిసే పనిచేయాలని ఆయన గట్టి హెచ్చరిక చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సజావుగా నిర్వహించిన అధికారులను మంత్రి అభినందించారు. అనంతరం కొత్తగా ఎన్నికైన సర్పంచులు బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో, గ్రామాల్లో ఉన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఏడు మండలాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా దాన్ని దాచిపెట్టకుండా జనవరి 15 లోపు ప్రతి గ్రామానికి సంబంధించిన పూర్తి నివేదిక రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రజలకు కనిపించే ఫలితాలు ఇవ్వాలని సూచించారు. ప్రజా పాలన ప్రభుత్వంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు వడ్డీలేని రుణాలు వంటి సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలవుతున్నాయా లేదా అన్నది నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. భూభారతిలో సాధబైనామాలకు సంబంధించిన సమస్యలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌లో ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో కొంతమంది అర్హులు లబ్ధి పొందలేకపోతున్న విషయాన్ని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో విధానపరమైన నిర్ణయాలు తనకు తెలియకుండా తీసుకోవద్దని, ప్రజల ప్రయోజనమే కేంద్రంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. నియోజకవర్గంలో సీఎస్సార్ నిధుల ద్వారా విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల మెరుగుదలకే మొదటి ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. ప్రతి మండలానికి ఒక మెడికల్ కాలేజీని దత్తత ఇచ్చి, ప్రభుత్వ పర్యవేక్షణలో ప్రతి గ్రామంలో తరచుగా మెడికల్ క్యాంపులు నిర్వహించేలా ఎమ్మార్వో, ఎంపిడివో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హుస్నాబాద్‌ను ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా మార్చాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి గ్రామంలో స్టీల్ బ్యాంక్ వినియోగం పెంచాలని సూచించారు. ప్రతి శుభకార్యంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించేలా అధికారుల పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. రోడ్లు, అంగన్వాడీ భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలు, డ్రైనేజీ పనులకు ఇప్పటికే శంకుస్థాపనలు చేసినప్పటికీ పురోగతి లేకపోవడంపై మంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పనుల ఆలస్యం సహించేది లేదని, పంచాయతీ రాజ్ శాఖలో పెండింగ్ బిల్లులు వారం రోజుల్లో విడుదలవుతాయని హామీ ఇచ్చారు. కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో కొండపైకి మెట్ల నిర్మాణానికి రూ.10 కోట్లతో శంకుస్థాపన చేసినప్పటికీ, జాతర సమయం దగ్గరపడుతున్నా పనుల్లో పురోగతి లేకపోవడాన్ని మంత్రి గట్టిగా ప్రశ్నించారు. ఈ సంవత్సరం నియోజకవర్గంలోని అన్ని చెరువుల్లో నాణ్యమైన చేప పిల్లలు వేశామని తెలిపారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల పునర్నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని, గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో గొర్రెలకు డీవార్మింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. భీమదేవరపల్లి మండలానికి నూతన కార్యాలయం మంజూరు చేయాలని, ఏ శాఖలోనూ వేకెన్సీలు లేకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసి హుస్నాబాద్‌ను సస్యశ్యామలం చేస్తామని, అందుకు అనుగుణంగా కాలువల భూసేకరణ వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. నిధులు ప్రభుత్వం ఎప్పటికప్పుడు విడుదల చేస్తుందని భరోసా ఇచ్చారు. జనవరి మొదటి వారం అనంతరం నియోజకవర్గంలో మండలాల వారిగా నూతనంగా ఎన్నికైన సర్పంచులతో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.

## సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం



**జనగామ, మన చౌరాస్తా :** రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించినప్పుడే రైతులకు, ప్రజలకు మేలు జరుగుతుందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. రఘునాథపల్లి మండలం నీడిగొండలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తెలంగాణ రైతు విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిసాన్ మేళా కార్యక్రమంలో జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా తో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. పత్తి సాగు, ఉత్పత్తి పెంచడానికి రైతులు, శాస్త్రవేత్తలతో కలిసి ఏర్పాటు చేసిన కిసాన్ మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



# పీవీ ఆలోచనలు చిరంజీవులు

- స్మృతి వనం ద్వారా చరిత్రకు అంకితం
- ఏడాదిలోపే పనులు పూర్తి చేసి మౌనమునికి ఘన నివాళి
- వి. హనుమంతరావు



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భారత రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహానాయకుడు, ప్రపంచ మేధావి, దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఆలోచనలు ఈ ప్రపంచం ఉన్నంతకాలం సజీవంగానే నిలిచిపోతాయని మాజీ పీసీసీ అధ్యక్షులు వి. హనుమంతరావు భావోద్వేగంగా అన్నారు. మాటలకన్నా మౌనమే తన బలంగా మలచుకున్న ఆ మహనీయుని స్మృతులు, భావాలు తరతరాలకు చేరాలంటే పీవీ స్మృతి వనం ఒక జీవంత చరిత్రగా నిలవాలన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో నిర్వహించిన పీవీ నరసింహారావు 21వ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొన్న హనుమంతరావు, ముందుగా పీవీ స్వగృహంలో ఏర్పాటు చేసిన విగ్రహానికి పుష్పాంజలి అర్పించారు. అనంతరం స్మృతి వనంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించి, పీవీ మ్యూజియంలో ఏర్పాటు చేసిన గ్యాలరీని సందర్శించారు. అక్కడ ప్రదర్శించిన చిత్రాలు, పత్రాలు, చారిత్రక ఘట్టాలను తిలకిస్తూ పీవీ జీవన ప్రస్థానాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న కాలంలో, పీవీ నరసింహారావు ఏఐసీసీ అధ్యక్షుడిగా దేశ రాజకీయాలను దిశానిర్దేశం చేశారని గుర్తుచేశారు. రాజకీయం అనేది అధికారానికి మాత్రమే కాకుండా, దేశ హితానికి అంకితమైన సేవ కావాలని పీవీ చూపిన మార్గం నేటి రాజకీయ నాయకులకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ప్రపంచీకరణకు బాటలు వేసిన దార్శనికుడు, భాషా పండితుడు, లౌకికవాదానికి నిలువెత్తు ప్రతీక అయిన పీవీ నరసింహారావు గౌరవానికి తగ్గట్టుగా ఆయన స్మృతి వనం అభివృద్ధి జరగకపోవడం బాధాకరమని హనుమంతరావు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో భారీ హామీలు ఇచ్చినా, వాస్తవంగా కేవలం ఏడు కోట్ల రూపాయలే కేటాయించడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని అన్నారు. పీవీ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పేలా స్మృతి వనం అభివృద్ధి కోసం మిగిలిన పది కోట్ల రూపాయలను సత్వరమే మంజూరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో వంగర గ్రామ పెద్దలతో కలిసి త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఏడాది తిరిగేలోపు స్మృతి వనం పనులను సంపూర్ణంగా పూర్తిచేసి, ఆ మౌనమునికి ఘనమైన నివాళులు అర్పిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వంగర గ్రామ సర్పంచ్ గజ్జెల సృజన, ఉప సర్పంచ్ వోల్లాల రమేష్, నాయకులు గజ్జెల రమేష్, జక్కుల అనిల్, ఆర్. వెంకటరెడ్డి, మొండయ్య, సత్తిరెడ్డి, సంపత్ తదితరులు పాల్గొని పీవీ స్మృతికి శ్రద్ధాంజలి ఘటించారు.

## మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**బచ్చనపేట, మన చౌరాస్తా :** అనారోగ్యంతో మరణించిన యాట కమలాకర్ కుటుంబానికి అంత్యక్రియలకు నిమిత్తం తమ వంతు సాయంగా రూ.21 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ మిత్రుడి మరణం ఎంతో కలచి వేసిందన్నారు. మిత్రుడి కుటుంబానికి అండగా ఉంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 2004 బ్యాచ్ కి చెందిన మిత్రులు తెలు శ్రీనివాస్, క్రాంతి, అంబాలా నాగరాజు, జుకంటి సుభాష్, ఎదుల బాబు తదితరులు పాల్గొన్నారు.





## జీవాలకు నట్టల నివారణ మందు

**మద్దూరు, మన చౌరాస్తా :** మద్దూరు మండలం కేంద్రంలో గొర్రెలు మరియు మేకలలో నట్టల నివారణ కార్యక్రమం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమం 31 డిసెంబర్ 2025 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి గ్రామం లోని గొర్రెలు, మేకలకు నట్టల మందులను వేయించుకోవాలన్నారు. ఇందులో భాగంగా మద్దూరు గ్రామంలో నట్టల నివారణ కార్యక్రమానికి సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గొల్ల కురుమ సంఘం అధ్యక్షుడు కుమార్, గొర్లకాపరులు, పశువైద్య సిబ్బంది డాక్టర్ హరికిషన్, సహాయకులు నవిన్, నవనీత, ఆఫీసు సబార్డినెట్ సత్యం, గోపాలమిత్ర రవి పాల్గొన్నారు.

# కొత్తకొండ బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**భీమదేవరపల్లి,మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గారు మినిస్టర్ క్వార్టర్స్‌లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనవరి 6వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్న శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరై, భక్తుల ఆశీర్వాదాలు స్వీకరించాలని ఆలయ ఈవో కిషన్ రావు, ఆలయ అర్చకులు మంత్రిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆగమశాస్త్ర ప్రకారం వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు వారు వివరించారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించి, ఈ మహోత్సవాలు విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.





# కొనసాగుతున్న రుద్రాభిశేకాలు

**బోథ్, మన చౌరాస్తా :** లోక కళ్యాణార్థం చేపట్టిన రుద్రాభిశేకాలు కొనసాగుతున్నయి. రెండవ రోజు కౌఠ(బి) గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోజువారీ లాగానే అభిషేకం, హోమాది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హోమంలో పాల్గొన్న భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. 51 రోజులు పూజలో పాల్గొనే భక్తులకు సరిపడా బియ్యం అందిస్తామని కౌఠ గ్రామానికి చెందిన యాల్ల జగదీశ్వర్ రెడ్డి సవిత దంపతులు ముందుకు వచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు భక్తిని పేంపోదిస్తాయని వారు పేర్కొన్నారు.

# రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ డిబేట్‌లో ముల్కనూర్ మోడల్ స్కూల్‌కు ఘన విజయం



**చిగురుమామిడి, మన చౌరాస్తా :** వారధి ఫౌండేషన్ మరియు తెలంగాణ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఆన్లైన్ డిబేట్ లో ముల్కనూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటుతూ తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. పర్యావరణం - సుస్థిరాభివృద్ధి అనే అత్యంత ప్రాధాన్యమైన అంశంపై జరిగిన ఈ పోటీలో రాష్ట్రవ్యాప్తంగా అనేక పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ డిబేట్ లో ముల్కనూర్ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు అశ్వంత్ రెడ్డి, అనుశ్రీ, వైష్ణవి చక్కటి వాదనలతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకొని తృతీయ స్థానం సాధించారు. పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాలకు బాధ్యత, సుస్థిర అభివృద్ధి అవసరం వంటి అంశాలను స్పష్టంగా వివరించి ప్రశంసలు అందుకున్నారు. తృతీయ స్థానాన్ని సాధించినందుకు గాను ఆయా విద్యార్థులకు రూ.500 నగదు బహుమతి తో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ విజయం ముల్కనూర్ మోడల్ స్కూల్‌కు గర్వకారణంగా నిలిచింది. రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ చాటిన విద్యార్థులను, వారిని సమర్థంగా మార్గనిర్దేశం చేసిన గైడ్ టీచర్ సయ్యద్ ఇర్షాద్ అలీని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ హర్జిత్ కౌర్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు ఇటువంటి పోటీల్లో పాల్గొని సామాజిక అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు.

## ‘బిషప్ తుమ్మ బాల’లో సెమీ క్రిస్మస్ వేడుకలు

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండలం మొండికుంట స్టేజ్ వద్దగల బిషప్ తుమ్మ బాల హైస్కూల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యేసు జననం గూర్చి విద్యార్థుల పలు సాంస్కృతిక కార్యక్రమాలు నాటికలు అలరించాయి. అలాగే పాఠశాల హెచ్ఎం ఉపాధ్యాయులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫాదర్ సతీష్, పాఠశాల హెచ్ఎం రివైండ్ ఫాదర్ వై.బాల రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# జీవో 252ను సవరించాలి

- **అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు ఇవ్వాలి**
- **సమాచార శాఖ డైరెక్టర్‌కు హెచ్‌యూజే, టీడబ్ల్యూజేఎఫ్ వినతి**

**హైదరాబాద్, మన చౌరాస్తా :** జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీవో 252లో అనేక లోపాలున్నాయని, వెంటనే వాటిని సవరించి జర్నలిస్టులకు న్యాయం చేయాలని హెచ్‌యూజే, టీడబ్ల్యూజేఎఫ్ సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. సోమవారం సమాచార శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అడిషనల్ డైరెక్టర్ జగన్ ను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. కొత్తగా అక్రిడిటేషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, ఇందుకు సీఎం రేవంత్ రెడ్డికి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. అయితే జీవోలో ఉన్న కొన్ని నిబంధనలు జర్నలిస్టులను గందరగోళానికి గురిచేసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 252లో జర్నలిస్టులను రెండు వర్గాలుగా విభజిస్తూ పాలసీ నిర్ణయం జరిగిందని, ఇది సరికాదని ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు. రిపోర్టర్లకు అక్రిడిటేషన్ అని, డెస్క్ జర్నలిస్టులకు మీడియా కార్డు అని పేర్లు పెట్టి విభజించడం




వల్ల డెస్క్ లో పనిచేసేవారికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికే కేంద్రం తీరుతో రైల్వే పాసులు పోయాయని, ఆర్టీసీ రాయితీ కూడా తగ్గించారని గుర్తు చేశారు. ఇప్పుడు మీడియా కార్డు పేరుతో డెస్క్ జర్నలిస్టులకు బస్ పాస్ సౌకర్యం బంద్ అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. డెస్కు జర్నలిస్టులకు కూడా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కొత్త నిబంధనల వల్ల చిన్న, మధ్య తరహా పత్రికలకు అక్రిడిటేషన్లు దక్కకుండా పోతున్నాయని చెప్పారు. గతంతో పోలిస్తే భారీగా కార్డుల సంఖ్యను తగ్గించారని, దీనివల్ల వందలాది మంది వర్కింగ్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు ఇవ్వాల్సిందేనని హెచ్యూజే, టీడబ్ల్యూజేఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. జీవో 252 లోపాలను సవరించి, డెస్క్ జర్నలిస్టులను, చిన్న పత్రికలను ఆదుకోవాలని కోరారు. కాగా, దీనిపై స్పందించిన అడిషనల్ డైరెక్టర్ జగన్ మీడియా కార్డులకు, అక్రిడిటేషన్ కార్డులకు ఒకే రకమైన సౌకర్యాలు ఉంటాయని చెప్పారు. డెస్క్ జర్నలిస్టులకు బస్ పాస్ ఉండదనేది అసత్య ప్రచారమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అడ్ హక్ కమిటీ కన్వీనర్ పిల్లి రాంచందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రాజశేఖర్, గుడిగ రఘు, హెచ్యూజే కార్యదర్శి జగదీశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గంధ్ర నవీన్, ఉపాధ్యక్షులు దామోదర్, డెస్కు జర్నలిస్టులు ఉపేందర్, మస్తాన్, సురేష్, కిరణ్, నరేష్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలి**

జర్నలిస్టులకు పెండింగ్ లో ఉన్న ఇండ్ల స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని హెచ్‌యూజే, టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్నట్లుగానే జర్నలిస్టులకు కూడా ఆరోగ్య విధానాన్ని (హెల్త్ స్కీమ్) అమలు చేయాలన్నారు. రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, మహిళా జర్నలిస్టులకు రాత్రి పూట రవాణా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని హెచ్ యూజే, టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# మేమెంతో మాకంత వాటా ఇవ్వాలి

- **జీహెచ్ఎంసీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నాగేష్ కురుమ**
- **కొండపోచమ్మ ఆవరణలో కురుమల ఆత్మీయ సమ్మేళనం**



**కొమురవెల్లి, మన చౌరాస్తా :** రాజకీయాల్లో ఉద్యోగాల్లో మేమెంతో మాకు అంత వాటా ఇవ్వాలని జీహెచ్ఎంసీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ డిమాండ్ చేశారు. చేర్యాల మండలం నాగపురి గ్రామ శివారులోని కొండపోచమ్మ ఆవరణలో ఓ ఫంక్షన్ హాల్ లో మంగళవారం జరిగిన కురుమల ఆత్మీయ సమ్మేళనంలో బూరుగడ్డ పుష్ప నాగేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారిని శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కురుమలు అన్ని రంగాల్లో వెనుకబడ్డారని వెనుకబాటుతనాన్ని పూడ్చాలంటే రాజకీయ రంగాలతో పాటు ఉద్యోగం వ్యాపారంగా, ఆర్థికంగా అన్ని విధాల ఎదగాలని తెలిపారు. స్థానిక సంస్థల్లో గెలుపొందిన ప్రజా ప్రతినిధులను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లన్న, ఉమ్మడి మెదక్ జిల్లా డైరెక్టర్ జింధం రాజమల్లయ్య, కేవైసీఎస్ రాష్ట్ర నాయకులు మీస సత్యనారాయణ, కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు కోరే ఎల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అందే నాని బాబు, యూత్ జిల్లా అధ్యక్షులు కంతుల రమేష్, అందే అశోక్, జయ రాములు, ఈరి భూమయ్య, ఎల్లయ్య, గోరుకంటి రమేష్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.



# ఓదెల నరేష్‌కు సేవరత్న గౌరవం

**వేములవాడ, మన చౌరాస్తా :** జీవితం ఒక్కోసారి మనిషిని గట్టిగా పరీక్షిస్తుంది. శరీరం సహకరించకపోయినా మనసు మాత్రం సేవ కోసం తపిస్తే ఎలా ఉంటుందో చూపిస్తున్న జీవంత ఉదాహరణ ఓదెల నరేష్. వికలాంగుడైనప్పటికీ కష్టాలను జయించి, సమాజ సేవను తన జీవన లక్ష్యంగా మార్చుకున్న ఆయనకు హైదరాబాద్ రవీంద్రభారతిలో మంగళవారం సేవరత్న అవార్డు లభించింది. తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరన్న గారి చేతుల మీదుగా, గద్దర్ వెన్నెల జయలక్ష్మి సన్నిధిలో నరేష్ అవార్డును స్వీకరించిన క్షణం సభలో ఉన్న ప్రతి ఒక్కరి మనసును కదిలించింది. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామం నుంచి వచ్చిన ఓదెల నరేష్ ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు. డిగ్రీ, ఐటీఐ వరకు చదువుకున్నాడు. ఉద్యోగం లేదు. ఆదాయం లేదు. కానీ సేవ చేయాలనే సంకల్పం మాత్రం అపారంగా ఉంది. కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తూ, తనలాంటి వికలాంగుల కోసం నిలబడి పోరాడటం ఆయన జీవితపు నిజమైన విజయకథ. తనకే సహాయం అవసరమైన పరిస్థితుల్లో కూడా, మరొకరి కన్నీళ్లు తుడిచే ప్రయత్నం చేయడం ఓదెల నరేష్ గొప్పతనం. వికలాంగుల హక్కులు, ప్రభుత్వ పథకాలు, న్యాయపోరాటాలు ఎక్కడ ఎవరికైనా అవసరం ఉంటే అక్కడ నరేష్ ఉంటాడు. శరీరానికి ఉన్న పరిమితులు ఆయన సేవా సంకల్పాన్ని ఆపలేకపోయాయి. ఈ సేవా ప్రయాణంలో ఇప్పటికే అనేక అవార్డులు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి. అయినా ప్రతి గౌరవాన్ని తనకోసం కాకుండా, వికలాంగుల సమాజానికి దక్కిన గుర్తింపుగా భావించడం ఆయన మనసు గొప్పతనానికి నిదర్శనం. తాజా గా అందుకున్న సేవరత్న అవార్డు ఆయన త్యాగానికి, తపనకు, నిస్వార్థ సేవకు వచ్చిన గౌరవంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గుత్తికొండ కిరణ్, కార్యదర్శి శివకృష్ణ, గద్దర్ వెన్నెల జయలక్ష్మి, హైకోర్టు న్యాయవాది డాక్టర్ దివ్యశ్రీ, ఆర్థోపెడిక్ వైద్యులు విజయ్ భాస్కర్, శ్రీమాతా సేవా సమితి కుసుమ విజయమ్మ, జవాబు ఛానల్ నలగొండ శ్రీనివాస్, యాదాద్రి జిల్లా అధ్యక్షులు నాగరాజు, చెంగుచెర్ల ఫౌండేషన్ శ్రీ రాజమాత, గంప శ్రీలత, యశోద తదితరులు పాల్గొని నరేష్ సేవా సంకల్పానికి వందనం చేశారు. శరీరం వికలాంగమైనా, ఆత్మ మాత్రం వికలాంగం కాదని నిరూపిస్తున్న ఓదెల నరేష్ కథ ఈ సమాజానికి ఒక గట్టి సందేశం. సేవ చేసేవాడికి కష్టం అడ్డుకాదని, సంకల్పం ఉంటే అవార్డులు తానే వెతుక్కుంటూ వస్తాయని ఆయన జీవితం చెబుతోంది.




# ఏకశిల డీజీ స్కూల్‌లో ప్రీ క్రిస్మస్ వేడుకలు

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ శివనగర్ ఏకశిల పాఠశాలలో మంగళవారం ప్రీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. కాగా పాఠశాలలో ఆరో తరగతి సీబీఎస్ఈకి చెందిన చదువుతున్న బత్తుల జ్ఞానశ్రీ పటేల్, లిఖిత, మౌనిక, ఆరోహి, అనన్య బృందం చేసిన నృత్యం పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నృత్య బృందాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ బేతి కొండల్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా బేతి కొండల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు మరింత రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు స్వప్న, స్వప్నలత తదితరులు పాల్గొన్నారు.



# మేడారం జాతర సమయానికి పనులన్నీ పూర్తి చేస్తాం

- తాత్కాలిక పనులు కాకుండా శ్వాశత పనులను చేపట్టాం
- 200 ఏళ్లు చెక్కుచెదరకుండా అమ్మవార్ల పునరుద్ధరణ పనులు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- మేడారంలో అభివృద్ధి పనుల పరిశీలన



**ములుగు, మన చౌరాస్తా** : మేడారం మహా జాతరను పురస్కరించుకుని చేపట్టిన అభివృద్ధి పనులను అనుకున్న గడువులోగా పూర్తి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తాత్కాలిక పనులు కాకుండా కనీసం 200 సంవత్సరాలు చెక్కుచెదరకుండా ఉండేలా శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. ఆదివాసీ గిరిజనుల మనోభావాలు దెబ్బతినకుండా ఆలయ పునరుద్ధరణ జరుగుతోందన్నారు. మంగళవారం మేడారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ తదితరులతో కలిసి శ్రీ సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులు, గద్దెల నిర్మాణం, క్యూ లైన్లు, ఆలయ ఫ్లోరింగ్, రోడ్లు, లైటింగ్, జంపన్నవాగు, ఆర్టీసీ బస్ స్టేషన్ పరిసరాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం హరిత హోటల్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, సివిల్ వర్క్స్, గద్దెల చుట్టూ గ్రిల్స్, ప్రాకారం బయటి సీసీ రోడ్లు డిసెంబర్ 31లోపు, ఇతర పనులు జనవరి 5లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీటి సమస్యలు రాకుండా శాశ్వత వాటర్ ట్యాంకులు, అన్ని రహదారుల పూర్తి, సెంట్రల్ లైటింగ్, సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ గిరిజన సంప్రదాయాలు ప్రతిబింబించేలా పాలరాతి శిల్పాలతో పునరుద్ధరణ జరుగుతోందని తెలిపారు. ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టితో భారీ నిధులు మంజూరు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీఓ చిత్ర మిశ్రా, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్డీఓ వెంకటేష్, పూజారులు, జిల్లా అధికారులు, ఆర్కిటెక్టులు, గుత్తేదారులు పాల్గొన్నారు.

# హ్యాట్రిక్ సాధించిన వార్డు మెంబర్

## హైమద్ సేవలకు పట్టం కట్టిన ప్రజలు



**చేర్యాల, మన చౌరాస్తా** : ఒకే వార్డులో మూడు పర్యాయాలు గెలుస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నాడు ఓ వార్డు సభ్యుడు.. వివరాల్లోకి వెళ్తే సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం మేజర్ గ్రామ పంచాయతీ ఆకునూరులో ఏడో వార్డు సభ్యుడిగా 2014 నుంచి 2025 వరకు జరిగిన ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు గెలుస్తూ హ్యాట్రిక్ సాధించాడు. స్వంత ప్రయోజనాల కన్నా ప్రజల ప్రయోజనాలే మిన్న అని భావించి వార్డులో ఉన్న ప్రజలకు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి వచ్చిన వెంటనే స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాడు. ఏ ఆపద వచ్చినా అండగా ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో తోడుగా నిలిచి కాలనీ ప్రజల మనసు గెలుచుకున్నాడు. ఈ మధ్యకాలంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించాడు. అతన్ని గ్రామస్తులు కాలనీవాసులు శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. తమ కు సేవలను గుర్తించి ఎన్నుకున్న ప్రజలకు, సహకరించిన సర్పంచ్, ఉప సర్పంచ్,వార్డు సభ్యులకు హైమద్ కృతజ్ఞతలు తెలిపారు.




# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**హనుమకొండ, మన చౌరాస్తా** : వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధిలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టి, శంకుస్థాపన చేసిన అనతికాలంలోనే పనులు ఆగిపోయయీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంగళవారం రోజున 59వ డివిజన్ పరిధిలోని కనకదుర్గ కాలనీలో రూ.74.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు వెడల్పు మరియు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపడేలా ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు అమలు చేస్తున్నామని, ప్రతి డివిజన్‌లో అవసరమైన పనులను గుర్తించి వేగంగా పూర్తిచేస్తున్నామని చెప్పారు. నాణ్యతలో ఎక్కడా రాజీ లేకుండా, ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి EV శ్రీనివాస్ రావు,డివిజన్ కార్పొరేటర్ వసంత,డివిజన్ ఇంచార్జ్ కేతిడి దీపక్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు కిరణ్, నాయకులునాగరాజు, సమ్మయ్య, సుదర్శన్ రెడ్డి, సుగుణ పార్టీ నాయకులు, అధికారులు, కాలనీ నివాసితులు పాల్గొన్నారు.



# ప్రైవేట్ ఫైనాన్స్‌లు రాకుండా చూడాలి

**భీమదేవరపల్లి, మన చౌరస్తా** : గ్రామాల్లోకి అధిక వడ్డీ తో మహిళలను మరింత అప్పులోకి నెట్టివేస్తున్న ప్రైవేట్ ఫైనాన్సులు రాకుండా గ్రామ పంచాయతీ తీర్మానం చేయాలని నూతన పాలక వర్గాన్ని గాంధీనగర్ విజయదుర్గ వివో సభ్యులు కోరారు. మంగళవారం నాడు గాంధీనగర్ నూతన పంచాయతీ పాలకవర్గాన్ని వివో సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వివో అధ్యక్షురాలు పులి పుష్ప మాట్లాడుతూ సంఘ అవసరాల కోసం నూతన భవనాన్ని మంజూరయ్యేలా నిర్మాణం జరిగేలా కృషి చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. గ్రామ అభివృద్ధిలో మహిళా సంఘాల పాత్ర కీలకమైనదని కాబట్టి ఐదేళ్లపాటు అందించే పరిపాలనలో తప్పకుండా భాగస్వాములు కావాలని గ్రామ సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుర్ర సమ్మయ్య, వివో కార్యదర్శి తాళ్లపల్లి ప్రమీల, కోశాధికారి తూముల తిరుమల, వివో ఏ తాళ్లపల్లి రాజేశ్వరి, సీసీలు సదానందం, పద్మ, వార్డు సభ్యులు కుమార్, మమత, సరిత, ఎల్లయ్య, రాజయ్య, శ్వేత,పద్మ, క్రాంతి కుమార్,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**